# ముత్యాల మనసు

ముత్యాలు తల్లి వెంట తిరుగుతూ "అమ్మా! దీనిమీద ఎక్కుతానే" అంటూ కుర్చీ ఎక్కబోయాడు.

"అమ్మగారు చూస్తే తంతారు. దిగుదిగు" పిల్లవాడిని దించి తన పనిమీద అవతలికి వెళ్ళిపోయింది వెంకటి.

తల్లిని వెళ్ళనిచ్చి ముత్యాలు తనకు సరిపోయినట్లుగా కనబడ్డ ఆ చిన్న కుర్చీమీద కూర్చుని - కాళ్ళు నేలకు తాకేటట్లుగా ముందుకు జరిగి-చేతులు రెండూ కుర్చీ చేతులమీద పెట్టి తనను తాను చూచుకొని - తల ఇటూఅటూ తిప్పి చూసాడు. తన సంగతి ఎవరూ చూడలేదన్న ధైర్యముతో బాగా సర్దుకొని కుర్చీలో వెనుకకు జరిగి కూర్చున్నాడు. కాలిమీద కాలువేసుకొని విలాసముగా ఊపుతూ ఒక్కసారి తల పైకెత్తాడు. ముత్యాల కెదురుగా గోడదగ్గర ముత్యాలు కూర్చున్నటువంటి కుర్చీలో - వాడివంటి పిల్లవాడే కూర్చున్నట్లుగా కనబడ్డది. సరిగ్గా వాడి చొక్కా ముత్యాలు వేసుకున్నదాని మాదిరిగానే ఉన్నది బుజముమీద చినుగూ అదీను. ముందు భాగమంతా నల్లగా మాసిపోయి అట్టకట్టి ఉన్నది. వాడి ముఖము, తల, జుట్టు అంతా ముత్యాలులాగే ఉన్నాడు. ముత్యాలు తననూ వాడినీ పరకాయించి చూస్తూ, పోల్చుతూ తన దేహాన్ని తడిమిచూసుకుంటూ ఆశ్చర్యపడిపోతున్నాడు.

ముత్యాలుకు కలిగిన ఆశ్చర్యము కౌతూహలము క్రిందికి మారటానికి ఎంతోసేపు పట్టలేదు. కుర్చీమీదినుంచి లేచి, మెల్లగా అడుగులు వేస్తూ, ఆ పిల్లవాడి దగ్గరికి బయలుదేరాడు ముత్యాలు. ఇట్లా రెండు అడుగులు వేశాడో లేదో, ఎదుటి పిల్లవాడు ఈ సంగతి గ్రహించినట్లే ఉన్నాడు - లేచి, ముత్యాలు కెదురుగా వస్తున్నాడు ముత్యాలు ఒక్కసారి ఉలిక్కి పడ్డాడు. మనుసు జంకుతున్నా, ధైర్యముచేసి ముందుకు అడుగులు వేశాడు ముత్యాలు. తీరా అక్కడికి చేరు

కుంటుండగా వాడి ఆశ్చర్యము మరీ ఎక్కువై పోయింది. ఆ పిల్లవాడు మొదలు అంత ధైర్యముగా బయలు దేరాడుగాని, తీరా ముత్యాలు తన దగ్గరికి వచ్చేసరికి తళతళలాడుతున్న గోడకు అంటుకొనిపోయాడు! అయినా అదలించి చూద్దామని ముత్యాలు చెయ్యి ఎత్తాడు. దానికి జవాబుగా వాడూ చెయ్యి ఎత్తాడు. ముత్యాలు దించగానే వాడూ దించాడు. తాను నవ్వితే వాడూ నవ్వుతున్నాడని ముత్యాలుకు అక్కసు కలిగి చేత్తో పట్టుకోబోయినాడు, కాని వాడు అందలేదు.

ముత్యాలుకు చాలా ఆశ్చర్యము కలిగింది. ఆ గోడలో ఈ పిల్లవాడే కాదు, ఆ గదిలో ఉన్న మంచాలు కుర్చీలు బల్లలు ఉయ్యాల అన్నీ కనబడుతున్నాయి. బట్టలు మడత చేస్తూ అటు తిరిగి నిలబడిన తల్లి కాలి దగ్గర్నుంచి తలవరకూ కనబడుతున్నది! ముత్యాలు మనసు ఆశ్చర్యముతో గంతులు వేసింది. వాడు పక పక నవ్వుతూ ఎడమ చేతిపైపుగా వెళ్ళి అక్కడ చిన్నగోడకు ఉన్న జాలీగుండా కిందికిచూశాడు, పెద్దతోటా,ప్రహరీగోడ నానుకొని ఉన్న ఓ చిన్నగదీ కనబడ్డాయి. 'ఆ గదిలో కటిక చీకటి. సన్నటి నూనెదీపము గాలికి కదులుతూ ఉంటుంది. ఈ గది ఎంత బాగుందో? నున్నటినేల, నేలమీద పరచిన రంగు రంగుల చాపలు, వాటిమీద నడుస్తుంటే ఇంకా నడవాలనిపించింది. ఆ మంచము ఎంత చక్కగా ఉన్నదో!'

హఠాత్తుగా ముత్యాలు ముఖము ముడుచుకొని పోయింది. తన తల్లి ఆ వెధవగదిలో చింకిచాపమీద బొంతగుడ్డ ఒకటి పడేసి పడుకోమని ఒక్కకేక పెట్టుంది. ఆ వాసనకొట్టున్న బొంతమీద కళ్ళనీళ్లు కారుస్తూ కళ్ళు మూసుకొని పడుకోవాలి. నాయనకూడా పడుకోమని కేక పెట్తూనే ఉంటాడు.

ముత్యాలు మెల్లగా అక్కడినుంచి లేచి మంచము దగ్గరికి వెళ్ళి దానిమీద పరచిన దుప్పటిమీద చెయ్యివేసి తాకి చూశాడు. అది వాడి బొంతనూ చొక్కానూ తాకినట్టుగా లేదు వాడి తండ్రి వేసుకునే ఖాకీబట్టలు తాకినట్టుగా కూడా లేదు. చేతికెంతో మెత్తగా తాకింది. వాడికెంతో బాగనిపించింది. మళ్ళీ మళ్ళీ తాకుదామనిపించుతున్నది. "అబ్బ! ఏమిటీ.........ఎంత మెత్తగా తాకుతున్నది?" అనుకుంటూ కనుబొమ్మలు పైకెత్తాడు. వెంటనే వాడి కేమనిపించిందో, ఆ మంచమెక్కి రెండుకాళ్లూ చాపి వెల్లకిలా పడుకొని,సంభ్రమముకొద్దీ కళ్లు మెరుస్తూండగా వాడిలో వాడే అనుకుంటున్నాడు "ఇంతబాగున్న మంచముమీద తనను పడుకో

బెట్టకుండా ఆ వెధవ చింకిచాపమీద పడుకోబెట్టుతుందేం తనతల్లి? అంత చెడ్డ దేమిటి?"

ముత్యాలు బాగా ఆలోచించి నిశ్చయించుకున్నాడు. "ఏమయినా సరే-తానా మంచముమీద పడుకోవలసిందే! ఇక తానెప్పుడూ ఆ చింకిచాపమీద పడుకోడు. వాసన కొట్టుతున్న ఆ బొంతను చేత్తోఅయినా తాకడు."

'ఆరివెధవా! అమ్మగారుచూస్తే తంతారు. దుప్పటి నలిగిపోయింది. లే'అని వెంకటి గదమాయించి రెక్కపట్టి కిందికి లాగేవరకూ ముత్యాలుకు ఆ ఊహే పోలేదు. 'నేను దానిమీదనే పడుకుంటా'నని ముత్యాలు మళ్ళీ మంచము ఎక్కబోయాడు. వెంకటి చెయ్యిపట్టి ఇవతలికిలాగి "తప్పుతప్పు! నాయిన పిలుస్తున్నాడు కిందికిపో" అని ఒక్కతోపు తోసింది. ముత్యాలు కెవ్వుమన్నాడు. వాడికి అక్కడినుంచి వెళ్ళాలనిలేదు. మళ్ళీ మంచముపైపుకు దారి తీశాడు.

అంతలో 'వెంకటీ' అన్న పిలుపు వినబడ్డది. వెంకటికి తొందర ఎక్కువైంది. ముత్యాలు తనమాట విననందుకు కోపము వచ్చింది. యజమానురాలు చూస్తే ఇంకేమయినా ఉన్నదా? బాబును నిద్రపుచ్చే వేళకూడా అయింది. బాబు చికాకు చేసుకొని కేకలు వేస్తున్నాడు. వెంకటి కోపముతో, ఆదుర్దాతో 'కిందికి పో వెధవా' అన్నది. తల్లి అంతగా ఎందుకు కోపము చేస్తున్నదో ముత్యాలు కర్థము కాక నిలబడిపోయాడు. యజమానురాలు మళ్ళీ పిలవటముతో వెంకటికి తొందర ఎక్కువై వాడి తలమీద దెబ్బవేసి అక్కడినుంచి వెళ్ళిపోయింది.

ముత్యాలు తలను తడిమిచూసుకుంటూ ఏడవటము మొదలు పెట్టాడు. అంతలో తండ్రి ఎటునుంచి వచ్చాడో మరో రెండు దెబ్బలు తగిలించి చెయ్యి పట్టుకొని ఈడ్చుకు వెళ్ళాడు.

ఆ మరునాటి ఉదయము ముత్యాలు నిద్రలేవగానే తల్లి ఎప్పటివలె కనబడ లేదు. 'లేవరా ముత్తిగా?' అని తండ్రి గదమాయించాడు. ముత్యాలుకు ఏడుపు వచ్చింది. 'పెద్దమ్మగారి ఊరునుంచి ఇక్కడికి వచ్చినప్పటినుంచీ అమ్మా నాయన తనవిట్లానే గదమాయిస్తున్నారు. ఆ చీకటిగది దాటి బయటికి రానివ్వరు. ఎంత సేపయినా అక్కడే కూచోవాలి. పెద్దమ్మగారి ఊళ్ళో చల్లగాలికి చెట్లకింద పిల్లలతో గోలీలాడుతుంటే ఎంత బాగుండేది!' అనిపించింది ముత్యాలుకు.

అంతలో తండ్రి మళ్లీ తనదగ్గరికి రావటము ముత్యాలు కంటబడ్డది. మెల్లగా లేచాడు తండ్రి బలవంతముగా ఈడ్చుకొనిపోయి ముఖము కడిగించి, ఒక గిన్నెలో పట్టెడన్నము కారపుముద్ద పడేసి ముందు పెట్టాడు. కళ్ళనీళ్ళతో తండ్రి మీద కోపముకొద్దీ ముత్యాలు ఒక ముద్ద నోట్లో పెట్టుకోగానే దగ్గు వచ్చింది. 'కుండలో నీళ్ళు ముంచుకొని తాగరా వెధవా !' అని కసిరాడు తండ్రి. భయము కొద్దీ ఆ నాలుగు మెతుకులూ తిని యిన్ని నీళ్ళు తాగాడు ముత్యాలు.

'ఇక్కడే ఉండు. కదలకు !' అంటూ తండ్రి ఖాకీచొక్కా వేసుకొని తోట వైపుకు వెళ్ళి పోయాడు. ముత్యాలు చేతిగోళ్లు కొరుక్కుంటూ ఆ గడపమీద కూర్చున్నాడు.

మేడమీది వరండాలో తల్లి బాబును ఎత్తుకొని బిస్కట్లు తినిపిస్తూ బొమ్మలు చూపిస్తూ తిరుగుతున్నది. అది చూచి ముత్యాలు ఆత్రముతో 'అమ్మా అమ్మా' అని కేక పెట్టాడు. వెంకటి ఇటువైపు చూడనన్నా లేదు. బాబుచేతిలో ఉన్న బిస్కట్టు ముక్క చూడగానే ముత్యాలుకు తానుతిన్న కారపు మెతుకులు జ్ఞాపకము వచ్చాయి. 'అప్పుడు తల్లి దగ్గర ఉంటే ఆ బిస్కట్టు యిచ్చేదేమో !' ముత్యాలు తల్లి దగ్గరికి వెళ్ళాలని బయలుదేరుతుండగా తండ్రి రానే వచ్చాడు 'ఎక్కడికిరా వెళ్ళేది ?' అని మళ్లీ వెనక్కిలాగి గదిలోకి నెట్టాడు.

వారమురోజుల తరువాత ముత్యాలుకు జ్వరము తగిలింది. పిల్లవాడిని చూసి పొమ్మని వెంకటికి ముత్యాలు తండ్రి చెప్పిపంపాడు. క్రమము తప్పకుండా అన్ని పనులూ చేసి వెంకటి మధ్యాహ్నపువేళ ముత్యాలును చూడటానికి వచ్చింది. ముత్యాలు మేలుకొనే ఉన్నాడప్పుడు. తల్లిని చూడగానే 'నీ వెంట వస్తా'నని ఏడుపు సాగించాడు. 'వద్దురా నీవు రాకూడదు' అంటూ వెంకటి ఎంత చెప్పినా ముత్యాలు ఏడుపు మానలేదు. బాబు ఏడుపు విని వెంకటి వెళ్ళిపోయింది. తండ్రి దగ్గర కూర్చొని కళ్లుతుడిచి చాపమీద ముత్యాలును పడుకోబెట్టాడు. కళ్ళనీళ్ళతో ముత్యాలు మేడవైపు చూశాడు. బాబును ఎత్తుకొని తనతల్లి నిలబడ్డది. బిస్కట్టుతినిపిస్తూ ముద్దు పెట్టుకుంటున్నది.

ముత్యాలు మనసు భగభగ మన్నది. ఏడుపు పెద్దదిచేసి లేచికూర్చున్నాడు. తండ్రి మంచిమాటలతో ఎంత చెప్పినా వినలేదు. ఏడుపు మానలేదు. అతడికి విసుగుపుట్టి వీపుమీద అయిదువేళ్ళూ అంటేటట్టుగా కొట్టాడు అ జ్వరపు ఒంటి మీద అయిదువేళ్ళూ వాతలు తేలాయి.

ఆరేళ్లు నిండీనిండని ముత్యాలు మనసులో ఆ ఊరు వచ్చిననాటినుండి ఒక విషయము కెలకవేస్తూ వచ్చింది. 'పెద్దమ్మగారి ఊళ్ళో ఉన్నప్పుడు తల్లి తనను ఎత్తుకొని తిరిగేది. దగ్గర పడుకో పెట్టుకొనేది. ఇక్కడికి వచ్చిన దగ్గరనుండీ తనను చీకటిగదిలో పడేసి, వాళ్ళ బాబును ఎత్తుకుంటున్నది. తనను దగ్గరికైనా రానివ్వటములేదు. తనకా చింకిచొక్కా తప్ప మరొకటి వెయ్యటము లేదు. బాబుకు మంచి మంచి బట్టలు వేస్తున్నది. ఆ బాబును ముద్దుకూడా పెట్టుకుంటున్నది. తనను నాయనా అమ్మా ఇద్దరు ఒకటే కొట్టటము మొదలు పెట్టారు. ఎందుకని?

ముత్యాలుకు ముఖ్యముగా ఆ ఊరు నచ్చలేదు. తనతో కూడా ఆడుకొనే పిల్లలు ఇక్కడలేరు. 'ముత్తిగా' అని ముద్దుగా పిలచే తల్లి 'వెధవా' అంటున్నది.

ముత్యాలుకు తన పెద్దమ్మగారి ఊరితోవ తెలియదు. కాని అక్కడినుంచి ఎనిమిదిరోజులు నడచిరావటము మాత్రము జ్ఞాపకమున్నది.

ముత్యాలు ఒంటిమీది జ్వరము జారలేదు. తండ్రి తోటపని చేసుకుంటూ ముత్యాలును చూస్తున్నాడు. వెంకటి బాబు నిద్రపోయినప్పుడుమాత్రము వచ్చి చూపిపోతున్నది - అదికూడా ముత్యాలు కన్నుమూసినప్పుడే. మెలకువగా ఉంటే ముత్యాలు తల్లిని విడవడుగదా!

అప్పటికి ముత్యాలు తల్లినిచూసి నాలుగు రోజులైంది. సాయంత్రపువేళ తండ్రి చెట్లకు నీళ్లు పోస్తున్నాడు. ముత్యాలు మెల్లగా లేచాడు. మేడమీదికి ఒకసారి చూశాడు. తల్లి కనబడలేదు. తలుపులు బాగా తెరచిన గేటును చూడగానే ముత్యాలు అడుగు ముందుకుపడ్డది. జ్వరపు ఒంటితో ఒకవీధి - రెండవ వీధి - క్రమముగా దాటిపోతున్నాడు. జ్వరతీవ్రతచేత ముత్యాలు శరీరము తూలిపోవటము మొదలు పెట్టింది. మూడవ వీధిలోకి రాగానే కళ్ళు చీకట్లు కమ్మినట్లయినది. కాళ్లు తడబడిపోయి, రోడ్డు ప్రక్కగా ఉన్న తూములో జారిపడ్డాడు. మరో రెండు నిమిషాలకు సారాబట్టీలోనుంచి పొగలు గక్కుతున్న వేడినీళ్ళు ఆ తూముగుండా ప్రవహించాయి.

చీకటిపడ్డ తరువాత వెంకటి అబ్బాయిగారిని ఎత్తుకొని ముద్దులాడుతూ ఉండగా ముత్యాలు కోసము తండ్రి వీధివీధి వెతకటము మొదలు పెట్టాడు

(1968 లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య ఎకాడమీవారు రచయిత్రుల కథానికలను ఏరి సంకలనముచేసిన 'కథా మందారము'లో చేర్చబడినది.)